ఇరువురు శూరులు

శ్రీమతి హవాయీ కావేరిబాయమ్మగారు బి.ఏ.ఎల్.టి.,

పూర్వకాలమున పారసీక దేశమునకును, టార్టారి రాజ్యమునకును, నిరంతర వైరముండెడిది. పారసీకుల వంశములం దొకదానిలో పరాక్రమవంతులగు పురుషులు జన్మించుచు, పోరులందు వారిరాజ్యమునకు జయము తెచ్చుచుండిరి. ఈ సంతతివారిలో, సాలనువాడు గొప్పవీరుడు. అతని పుత్రుడగు రుస్తుం, తండ్రి కన్న బలశాలియగు శూరుడు. ఇతనిపేరు వినినంత మాత్రమున శత్రుసైన్యము చెదరిపోవును.

రుస్తుమునకు రుక్షను గుఱ్ఱమొకటియుండెను. యజమానునికి తగినవాహనమే. తురగరూపముదాల్చిన మహాశక్తి యనవచ్చును. ఒకనాడు రుక్షు కనబడలేదు. తనప్రియవాహనమును, వెదకుచు, రుస్తుమనేకస్థలములకేగెను. ఈ సమయమున, పారసీకమునకును టార్టారికిని సమాధానముండెను. రుస్తుము, టార్టారీలో తన గుఱ్ఱమును వెదుకుచువచ్చి, యాదేశపు రాజపుత్రికను వివాహమాడెను.

కొన్నిమాసములు టార్టారీలో గడుపునంతలో, మహాశూరుడగు రుస్తుమునకు మిక్కిలి సంకటముగా నుండెను. యుద్ధములేనిది, యతనికి యున్మాదము కలిగించెను. కనుక, స్వదేశము వెళ్లుటకు నిశ్చయించెను. ఈసమయమున భార్య గర్భిణిగనుండుటచేత, జన్మింపబోవు శిశువుయొక్క శరీరముమీద, ముద్రవేయుమని, తన కవచమిచ్చి, వీడుకొల్పి వెళ్లిపోయెను.

కొంతకాలమైన పిమ్మట, రుస్తుము భార్యయగు, అఫ్రాసి యాబురాజు తనయ కొక చిన్నికుమారు డుద్భవించెను. పుత్రుడు జన్మించెనను వర్తమానము భర్తకు తెలియచేసినచో, కుమారుని, తనవంటి వీరునిగా తయారుచేయుటకొరకు, తల్లినుండి యెడబాటుచేసి, రుస్తుము తీసుకవెళ్లిపోవునను భీతివలన, రాజపుత్రి తనకు కూతురుపుట్టినని యసత్యవార్తపంపెను.

రుస్తుము భార్యనుగాని, బిడ్డనుగాని, చూచుటకు మరల టార్టారీ రాకపోయెను. అతని దేశమందు, పరాక్రమ కృత్యములుచేయుచు కీర్తిబడయుచుండెను. అతనిపుత్రుడగు సోరాబు, తాతగారింట పెరుగుచుండెను. బాల్యమునందే, యితడద్భుతకరమైన బాహుబలమును కనపరచుచుండెను. కొంతకాలములో, టార్టారిదేశపు మహాశూరు లెవరును, సోరాబుకుసాటి రాకపోయిరి. రుస్తుముయొక్క యశస్సంతటను వ్యాపించుటచేతను, నిట్టి మహాపురుషుడగు తండ్రిని చూడవలెనని, యీ బాలశూరుడు మిక్కిలి యుత్సహించుచుండెను. తండ్రి తనవద్దకురానియెడల, జనకుని వెతకుటకు, వెళ్లవలెనని నిశ్చయించెను. తల్లి యెంతో ...చినను తండ్రినిచూడవలెనను కాంక్షవలన సోరాబునకు మరియేవిధమైన తలంపులేకపోయెను.

ఏవిధముగా జనకుని దర్శనము తనకు లభించునా యని సోరాబు తలపోసెను. రుస్తుమెచ్చటనుండు నది యతనికి యెరుకలేదు. కాని యెచ్చటున్నను సమరమునకు మొదటివాడుగా తయారగుట నిశ్చయము. రుస్తుములేనిదే, పారసీకసైన్యము, యుద్ధమునకు రాదు. కనుక నొకటార్టారిదండును సోరాబు పారసీకముమీదకు తీసుకవెళ్ళినచో, తండ్రిని కలసికొనగలడని యోచించి యేర్పాటుచేసెను.

పారసీకదేశములో సోరాబు కీర్తి వినవచ్చుచుండెను. ఇంతలో నొకటార్టారిసైన్యము వారి రాజ్యముమీదకు దండెత్తివచ్చెను. టార్టారీ దూతయొకడు పారసీసేనాధిపతియొద్దకువచ్చి, "పోరునందనేకమంది యిరుపక్కల మరణించుకంటె మీశూరుడొకడు మాశూరునితో, ద్వంద్వయుద్ధము చేయుటకు పంపుడి! ఎవరుగెలుతురో, వారిపక్షము జయముపొందినట్లు నిశ్చయింతము." పారసీకులు వప్పుకొనిన యెడల, రుస్తుము నేకదా పంపుదురు! తండ్రిని కలిసికొనవచ్చునని సోరాబు నమ్మెను.

పారసీకసైన్యము విశ్రాంతినొందెను. రుస్తుముగాక, వారి దేశమును రక్షించువారు, మఱెవరును లేరు. పారసీకరాజు, తనబంధువునికి సేనానాయకత్వము నిచ్చుటచేత రుస్తుంతనవిభునిమీద నలిగి తనగుడారము విడచిరాదయ్యెను. సేనాధిపతి, యీమహాశూరుని యొద్దకరిగి, యుపద్రవకాలమందు, దేశభక్తిమాని, యల్ప విషయములకొఱకు, భుజబలమును దేశమును కాపాడుటకు వినియోగపరచననుట, రుస్తుమువంటి పరాక్రమశాలికి తగదని చెప్పి, పలుపలువిధములుగా, నతని రమ్మని వేడెను. తనుపొందవలసిన గౌరవము చూపని ఖాయిఖుస్రు రాజుయొక్క కృతఘ్నతను నిందించుచు, తుదకు మారువేషముతో యుద్ధముచేయుటకు సమ్మతించెను.

అక్సనువదియొద్దను రెండుసైన్యములు నెట్టెదురుగా విడిసియుండెను. ద్వంద్వయుద్ధస్థలమందు శూరులిరువురు నొకరినొకరె దుర్కొనుటచూచిరి. మేరుపర్వతమువలె, సోరాబు కనబడెను. రుస్తుమును చూడడముతోనే, యతనిని కౌగలింపవలెనను కాంక్ష సోరాబునకు కలిగెను. కాని, పర్వతమువంటి విగ్రహమునుబట్టి తండ్రియను కొందమనిన, పలానశూరుడని తెలుపు చిహ్నములేవియు, నతడు ధరించియుండలేదు.

సోరాబును చూచి రుస్తుము చిరాకుపడెను." ఈపసిబాలుడొక వీరుడా? ఇతనితో కలబడుటనేనా?" యని స్వాంతమున తలచి, నవ్వుచు సోరాబుతో నిట్లనెను.

"అబ్బాయి, వృథాగా మరణము నెందుకు కోరుచున్నావు? నీసైన్యమును వెంటబెట్టుకొని మరలి పొమ్ము."

"ఓశూరశిఖామణీ, నీవు రుస్తుమేనా, చెప్పు"మని సోరాబు ప్రతిమాలెను.

"రుస్తుము కుఱ్ఱవాళ్లకు తన బాహుబలము చూపునా? తడవుచేయక వెళ్ళిపొమ్ము"ని రుస్తుమనెను.

"బాలుడైనను, యనేకయుద్ధములను చూచి యుంటిని రక్తప్రవాహములోబడి, యితర శూరులకన్న ముందుగా వధగావించుటకు వెళ్లియున్నాను. అయ్యో, నీతో పోరాడుటకు నాకు భీతి లేశమాత్రమైనను లేదు. కాని నిన్ను చూచినప్పటినుండి, నాహృదయము నీవశమైనది. నీసైన్యమందనేకమంది శూరులున్నారు. నాసైన్యమందుకూడ గలరు. మనకు ప్రతిగా వారిలో నిరువురు యుద్ధము చేయనిమ్ము. మన మిరువురము శత్రుత్వము మానుదము. ఇచ్చట నీయిసుకమీదనే కూర్చుండి ద్రాక్షారసపానముతో మన మిత్రత్వము దృఢపరచుద"మని సోరాబనెను.

"ఏమికబుర్లు చెప్పుతావోయి. ఈలాగ పేలేవాడేనా రుస్తుముతో యుద్ధముచేయుదము? నీముఖలావణ్యము, నీశరీరసుకుమారము ఆడుదానికే తగును. అఫ్రాసియాబు పూలవనములో నాట్యముచేసినట్లనుకొన్నావా, నాతో యుద్ధము? నీచిలుకపలుకులు మాని, కాచుకో నాదెబ్బకు. ఈమారు అక్సనునది వరదలువచ్చినప్పుడు నీయెముకలు దానిమీద తేలును."

ఇట్లనుచు రుస్తుము దుడ్డుకఱ్ఱనెత్తెను. వేళ్లతో పెకలింపబడిన యొక మహావృక్షము రుస్తుముయొక్క దుడ్డుకఱ్ఱ. సోరాబుమీద నదిదిగిన యెడల బాలశూరుని పిప్పిచేయును. కాని విసురుమీద నదిక్రిందికి వచ్చునంతలో సోరాబు ప్రక్కకుగెంతెను. కఱ్ఱ యిసుకలో లోతుగా దిగబడెను. దానివెనుక రుస్తుముకూలెను. అసహాయుడై యిట్లున్నసమయములో, పారసికశూరుని క్షణమాత్రమున సోరాబు వధించి యుండవచ్చును. కాని యది పరాక్రమము కాదు. కనుక నవ్వుచు,

"నీకఱ్ఱ అక్సనునది వరదలమీద తేలును, నాయెముకలు కావు"అనెను. మరల రాజీకోరెను.

రుస్తుమీమాటికి లేచెను. కోపాగ్ని యతనిలో మండుచుండెను. అతనిచేష్టలు పిచ్చివానివలె నుండెను. "గంతులువేయుడము బాగా నేర్చావు. లాగు నీకత్తి" యని తన ఖడ్గము నూపుచు సోరాబుమీదికి

వెళ్లెను. తండ్రి కొడుకుల యుద్ధము ప్రకృతి చూడలేకపోయెను. ఆకాశము చీకట్లుక్రమ్మెను. పెద్దతుపాను లేచి యిసుకను లేపి మిన్ను మన్ను నొకటిచేసెను. ఉరుములు, మెరుములు పుట్టెను. భూమికంపించెను. ఈ భయంకరధ్వని, ఆక్సనుమీద వెళ్లినప్పుడొక క్షణములోనది చేరుకొనెను. ఘోరయుద్ధము జరిగెను. ఒకరి నొకరు కొట్టుకొను దెబ్బలధ్వనిమట్టుకు వినబడుచుండెను.

వీరి కవచములకును కటారులకును పోట్లుతగిలెను, రుస్తుము దెబ్బలుభయంకరమైనవి. సోరాబు తప్పు కొనుచుండెను. కాని యీ వెలతో వతనికి చేర్పుండెను. ఇట్లు, యుద్ధము జరుగుచుండగా రుస్తుము శిరరక్షకు దెబ్బతగిలి, దాని శిఖరమునన్న తురాయి క్రిందపడెను. ఈయవమానమున కోర్వలేక, పెద్దధ్వనితో "రుస్తుం" అని కేకవేసి కత్తినెత్తెను, ఒక క్షణమాత్రము సోరాబేమియులోచక, కొయ్యబారెను. తండ్రికత్తి శరీరములోనికి జొచ్చుకొనిపోయి బాలశూరుడు నేలంగూలెను.

మరణావస్థలో దీనస్వరముతో సోరాబిట్లనెను. "నీవు కాదు నన్నుచంపినది. నాకతిప్రియమగు, 'రుస్తు' మను పేరు, నీవు చెప్పుటవలన నేను కాచుకొనుటమాని, నిలిచితిని. అసహాయుని నరికితివి. ఈసంగతి నాతండ్రియగు రుస్తుము వినినచో, నిన్ను విడుచునా?"

"రుస్తుమునకు పుత్రసంతానము లేదు. అతనికొకపుత్రిక మాత్రమే;ఆబాలిక అఫ్రాసియాబు భవనమందు జనమున కుపయోగమైన పనులు చేర్చుచున్న"దని రుస్తుమనెను.

"రుస్తుమునకు కలిగినది కుమారుడే. ఆకుమారుడు నేనే"యని సోరాబుచెప్పెను.

"నీవట్లుచెప్పుట కాధారమేమి? ఏదైనబుజువు చూపగలవా?"యనెను రుస్తుము.

తన కవచమును తీసివేసి, భుజమునుండి వస్త్రముతొలగించి తన శరీరముమీదగల సాక్ష్యమును చూడ మని సోరాబుచెప్పెను. రుస్తుమట్లేచేసెను. తెల్లని పింగాణీవంటి భుజముమీద, సిందూరవర్ణములో రుస్తుము యొక్క కవచము ముద్రయుండెను. స్వహస్తములో కన్నకొడుకు ప్రాణముతీసివేసిన, రుస్తుముపద్రవమైన దుఃఖసాగరములో మునిగెను. ప్రాణమువిడుచుటకు పూర్వము కండ్లార తండ్రిని చూడగలభాగ్యము లభించి నందులకును, రుస్తుముయొక్క ప్రఖ్యాతిగాంచిన గుర్రమగు రుక్షునుకూడ కాంచినందులకును సోరాబు సంతసిల్లెను.

ఈలోన, యంధకారము, గాలి, యురుములు, మెరుములు చెదరిపోయెను. పారసీక టార్టారీసేనలు శూరశిఖామణులకొరకు చూచిరి. సోరాబుశవము క్రిందపడియుండెను. రుస్తుముయొక్క కొండవంటివిగ్రహము, నేలనుక్రుంగి యాశవముమీద వ్రాలి విలపించుచున్న దృశ్యము వారికి కనిపించెను. ఆక్సనునది యెప్పటివలనే ప్రవహించిపోవుచుండెను.